# జీ.వో. నెం.1 పాలకవర్గాల కుమ్ములాటలో భాగంగా అంతిమంగా ప్రజలపై పెంచుతున్న నిర్బంధం

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా కూడళ్ళలో సభలు, రోడ్‌షోలను నిషేదిస్తూ కాలం చెల్లిన 1861 నాటి ఖాకీ చట్టానికి మరిన్ని సవరణలు చేస్తూ జీ.వో. నెం.1ని విడుదల చేసింది. అధికార, ప్రతిపక్ష పార్టీల కుమ్ములాటలో భాగంగా ఇది పైకి కనిపించినా, అంతిమ పరిశీలనలో ప్రజల వాక్, సభా స్వాతంత్ర్యాలను, తమ అసమ్మతిని, నిరసనలను తెలియజెప్పే ప్రాథమిక హక్కులను కాలరాయటానికే గతకాలపు నిర్బంధ చట్టాల కోరలకు మరింత పదును పెడ్తున్నారనేది వాస్తవం.

రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు మరో ఏడాది పైగా కాలపరిమితి వున్నప్పటికీ, రాష్ట్రంలో అధికార, విపక్షాలు ఇప్పుడే ఎన్నికలు జరిగిపోతున్నట్లుగా మోహరిస్తున్నాయి. ప్రభుత్వాధికారంలోనున్న వైసిపి తన అధికార యంత్రాంగాన్ని, పోలీసు బలగాలను వినియోగించి రాష్ట్రం నలుమూలలా 'అధికారిక' పర్యటనలు, 'భారీ' సభలు జరుపుతోంది. కాగా, ప్రభుత్వాధికారానికి దూరమైన టిడిపి, చావు బ్రతుకుల సమస్యగా ఎంచి తన 'శక్తియుక్తుల'న్నింటినీ వెలికితీసి వైసిపి ప్రభుత్వాన్ని తూర్పారబడుతూ వివిధ జిల్లాలలో చంద్రబాబు నేతృత్వంలో సభలను, రోడ్‌షోలను నిర్వహిస్తోంది. కాగా, పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో 'వారాహి' వాహనంపై మరో రోడ్‌షోకు జనసేన సమాయత్తమౌతోంది.

తెలుగుదేశం పార్టీ డిసెంబర్ 28న కందుకూరు సెంటర్‌లో నిర్వహించిన బహిరంగసభ, రోడ్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఊపిరాడక 8 మంది ప్రజలు మరణించగా, మరి అనేకమంది గాయాల పాలయ్యారు. ఇది జరిగిన 3 రోజులలోనే గుంటూరులో చంద్రబాబునాయుడు 'చంద్రన్న కానుకలు' కొందరికి అందజేసి వెనుదిరిగిన కొద్దిసేపటికే జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మహిళలు మరణించారు. డ్రోన్ షాట్‌ల ప్రచార వ్యామోహంతో ఇరుకు ప్రదేశాల్లో సభలు నిర్వహిస్తూ, తమ సభలకు వేలాదిగా ప్రజలు హాజరవుతున్నారని టిడిపి చౌకబారు ప్రచారం చేసుకుంటుందని వైసిపి ఆరోపిస్తుండగా, తమ సభలకు, రోడ్‌షోలకు తగిన సంఖ్యలో పోలీస్ సిబ్బందిని కేటాయించకుండా, రద్దీని నియంత్రించకుండా వదిలేయటమే ఈ తొక్కిసలాటలకు, మరణాలకు కారణమని టిడిపి ప్రత్యారోపణలు చేస్తున్నది. దురదృష్టకరమైన ఈ ఘటనలకు పాలక, విపక్షాలుగా ఎవరి బాధ్యతలేమిటో గుర్తించటానికి బదులు పరస్పర నిందారోపణలతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. వీరెవరికీ ప్రజల వాస్తవిక జీవన సమస్యలతో నిమిత్తం లేదని స్పష్టమౌతోంది.

కోవిడ్ కాలం దాటిపోయిందనుకుంటూ వుండగానే మరోసారి ఆ పెనుభూతం ప్రపంచంపై విరుచుకుపడనుందని పాలక ప్రభుత్వాలు ప్రకటనలు చేసి చేతులు దులుపు కుంటున్నాయి. 2019-22 మధ్య కరోనా హెచ్చుతగ్గులతో కొనసాగిన కాలంలో సామాన్య ప్రజానీకం ఎదుర్కొన్న చేదు అనుభవాలు పునరావృతం కాకుండా వైద్య, ఆరోగ్యరంగాలపై దృష్టిసారించి పాలకులు చేపట్టిన చర్యలు శూన్యం.

మరోవైపు పంటలకు గిట్టుబాటు ధరలేక, తుఫాను నష్టాన్ని తట్టుకొని చేతికొచ్చిన ధాన్యాన్ని కొనే నాధుడు లేక, రైతాంగం తీవ్ర సమస్యల నెదుర్కొంటున్నారు. రైతుల, ముఖ్యంగా - కౌలు రైతుల ఆత్మహత్యలు సాగుతున్నాయి. పెరుగుతున్న ధరలతో, తరుగుతున్న పనిదినాలతో, చాలీచాలని కూలి డబ్బుతో రైతు కూలీలు, శ్రామిక ప్రజానీకం పడరాని పాట్లు పడుతున్నారు. పన్నుల భారాలు, విద్యుత్‌ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల నిరంతరాయ పెరుగుదలతో, సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం అవస్థలు పడుతున్నారు. పారిశ్రామిక యాజమానుల ఉద్దేశ పూరిత నిర్లక్ష్యం కారణంగా ఎందరో కార్మికుల ప్రాణాలు ప్రతిరోజూ అనంతవాయువుల్లో కలిసిపోతున్నాయి. మహిళలపై, బాలికలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, 'పరువు' హత్యలు నిరాటంకంగా సాగిపోతున్నాయి. అడవి తల్లి నుండి ఆదివాసులను గెంటివేస్తూ విస్థాపనకు గురిచేస్తున్నారు. దళితులపై దమనకాండ, దాడుల వార్తలు ప్రతిరోజూ పత్రికల కెక్కుతూనే వున్నాయి

విస్తరిస్తున్న యుద్ధ సంస్కృతి, పెరుగుతోన్న ద్రవ్యోల్బణం, రెక్కలు మొలిచిన నిత్యావసరాల ధరలు, ప్రజల జీవితాలను వెక్కిరిస్తున్నాయి. తీవ్రమౌతున్న శ్రమదోపిడీ, తరుగుతున్న వేతనాలు, పెచ్చరిల్లుతున్న ఆధిపత్య హింసోన్మాదం, చెలరేగుతున్న కుల, మత, భాషా, ప్రాంతీయ విద్వేషాలు ప్రజానీకాన్ని సమస్యల సుడిగుండంలో పడదోస్తున్నాయి.

ఈ నేపథ్యంలో, వివిధ రంగాలకు చెందిన ప్రజానీకం వారి సమస్యల మీద వీధుల్లోకి రావటం పెరుగుతోంది. ముఖ్యంగా ఇటీవల ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలు వెల్లువలా కదలి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిని సహించలేని ప్రభుత్వం వారిపై అనేక నిర్బంధాల్ని ప్రయోగించింది; వేధించింది.

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనలను, అసమ్మతిని తెలియజేయటం, ప్రకటించడం 'పవిత్ర రాజ్యాంగం' కల్పించిన హక్కుగా పాలకులందరూ పేర్కొంటారు. అయితే తాము అధికారంలోకి వచ్చాక మాత్రం రాజ్యాంగ నిబంధనలను 'తూనా బొడ్డుంబాల్' అంటూ తీసిపడేస్తున్నారు. ప్రజలకు అసౌకర్యం పేరిట ఇప్పటికే హైదరాబాద్‌లో, విజయవాడలలో నిరసనలు తెలిపే, ధర్నాలు నిర్వహించే ప్రదేశాలను ప్రజలకు సంబంధం లేని ప్రాంతాలకు పరిమితం చేశారు. నిర్బంధ చట్టాల కోరలకు కొత్తగా పదును పెట్టడంలో కేంద్ర, రాష్ట్రాల పాలకులు పోటీపడ్డున్నారు.

గౌరవప్రదమైన జీవనం కోసం ప్రజలు పోరాటం సాగించటం కూడా ఒక ప్రజాస్వామిక హక్కు అనే చైతన్యాన్ని పెంపొందించటం నేటి తక్షణావసరంగా ముందుంది. దోపిడీవర్గాలు తమ అధికారాన్ని ఎక్కువకాలం నిలుపుకునేందుకు ఎన్ని జిమ్మిక్కులు చేస్తున్నప్పటికీ, సంక్షోభం తీవ్రత ప్రజలను ఆందోళనల్లోకి కదలిస్తోంది. సంఘటితమౌతోన్న ప్రజలపై, ప్రజాఉద్యమాలపై, ఉద్యమ నాయకులపై సాగుతున్న అన్ని విధాలైన నిర్బంధాన్ని, నిర్బంధ చర్యలను, నిర్బంధ చట్టాలను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామిక ఉద్యమానికి ప్రజాతంత్రవాదులు, మేధావులు పూనిక వహించాలి.

*****